క్లుప్తంగా

జాబ్‌మేళాలో 38 మందికి ఉద్యోగాలు



నియామక పత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 38 మందికి ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో హెటిరో ల్యాబ్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్ వాల్వో హెచ్ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్‌కిషాన్ అగ్రీ అండ్ కో కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారని తెలిపారు. మొత్తం 96 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, కృష్ణశశాంక, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సౌకర్యాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న వైద్యురాలు సాగరిక

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో రోగులకు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వైద్యురాలు సాగరిక, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ తెలిపారు. మంగళవారం సీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అవసరమైన మందులు, పరికరాల కొనుగోలు, వసతులపై చర్చించారు. రూ.2.50 లక్షల నిధులతో రోగులకు మెరుగైన వసతులు, మందులు, పరికరాలు కొనుగోలు చేస్తామని సభ్యుల ఆమోదంతో తీర్మాణం చేశారు. కార్యక్రమంలో వైద్యులు చరణ్ రాజ్, వాణి స్వప్న ప్రియ, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు అనురాధమ్మ, వన్నూర్ బాషా పాల్గొన్నారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి కిషోర్

డోన్ రూరల్: మామిడిలో సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు అన్నారు. మండల పరిధిలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త కిషోర్ మామిడిలో సస్యరక్షణలో చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

పకడ్బందీగా రీసర్వే



సమీక్షిస్తున్న ఆర్డీఓ

ప్యాపిలి: గ్రామాల్లో రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ నరసింహులు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రీసర్వే విషయంలో సర్వేయర్లు పని చేయాలన్నారు. రైతులు తమ దృష్టికి తెచ్చిన సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ భారతిని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధులను గుర్తించడం ముఖ్యం




పశువులకు చికిత్స చేస్తున్న వైద్యురాలు

అవుకు: పశువులకు సకాంలో వ్యాధులు గుర్తించడం చాలా ముఖ్యమని పశువైద్యురాలు భారతీదేవి అన్నారు. మండల కేంద్రంలోని మెట్టుపల్లె గ్రామంలో మంగళవారం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. అలాగే 20 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. పొదుగు వ్యాధి పరీక్షలు చేశారు. పాడి పశువులకు సోకే వ్యాధులను సకాలంలో గుర్తించి వాటిని కాపాడుకోవాలని పాడిరైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్ఏలు, పశుమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

అబ్బురం.. శిల్పకళా నైపుణ్యం

- లక్ష్మీనరసింహస్వామి ఆలయంపై ఆకట్టుకుంటున్న శిల్పాలు
- రూ.7 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు



దేవతలు, రాక్షసుల మధ్య క్షీరసాగర మధనం

కొలిమిగుండ్ల: ఏ ఆకారం లేని బండరాళ్లను తీసుకొచ్చి తమ అద్భుత ప్రతిభా పాటవాలతో సజీవ శిల్పాలుగా మలిచారు. వందల ఏళ్ల క్రితం కేవలం పని ముట్లతో చేతి సాయంతో చెక్కిన శిల్పాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉండిపోయాయి. కొలిమిగుండ్ల కొండపై వెలసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో నిర్మించినట్లు ఇక్కడ లభించిన ఆధారాల ద్వారా తెలుస్తోంది. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రామ్‌కో సిమెంట్ యాజమాన్యం రూ.7 కోట్ల వ్యయంతో ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు చేయిస్తోంది. దశాబ్దాల క్రితం గర్భగుడికి చుట్టూ ఉన్న గోడలపై చెక్కిన అద్భుత శిల్పకళా సంపద కాలక్రమేణా సున్నం వేయడంతో వాటి సౌందర్యం కనిపించకుండా ఇన్నాళ్లు మరుగున పడింది. పనుల్లో భాగంగా ఇటీవనే మిషన్‌ల సాయంతో సున్నాన్ని తొలగించడంతో శిల్పకళకు పూర్వ వైభవం సంతరించుకుంది. దీంతో భక్తులు ఆ దృశ్యాలను ఆసక్తిగా తిలకించేందుకు కొండపైకి వస్తున్నారు. రామాయణ ఘట్టం, దేవతలు, రాక్షసులు అమృతం కోసం సాగర మధనాన్ని చిలికే దృశ్యాలు ఉన్నాయి. లక్ష్మీనరసింహస్వామి ఉగ్రరూపుడై హిరణ్యకశిపుడిని చీల్చి వేసే చిత్రాలు ఉన్నాయి. ఇవే కాక వేంకటేశ్వరస్వామి, అన్నమాచార్యులు, అష్టభుజి, కుబేరుడు, వాయువు, నారద తుంబరులు, యముడు, భైరవి, క్షేత్ర పాలకులు ఇలా ఎంతో మంది దేవతామూర్తుల శిల్పాలు చెక్కారు. గర్భగుడి ఏ మాత్రం చెదిరిపోకుండా రాజులు చెక్కించిన శిల్పాలు చెదిరిపోకుండా జాగ్రత్తలు పాటించారు. ఆలయ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని.. స్వామివారి పునఃదర్శనం ఎప్పుడు అవుతుందా అని భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



జీర్ణోద్ధరణతో సుందరంగా మారిన గర్భగుడి, గాలిగోపురం



రామాయణ ఘట్టం వివరించే శిల్పాలు



గోడలపై వివిధ రకాల దేవతామూర్తుల శిల్పాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాడు, పెద్దపాయ, వెంకటకొండాపురం, పీఆర్ పల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వెంగళాంపల్లి, ఎన్ రంగాపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వెంగళాంపల్లి, గుడిపాడు ఫీడర్‌లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కోవెలకుంట్ల: మండలంలోని కొందరు వీఆర్ఏలు విధులపై నిర్లక్ష్యం వహిస్తుండడం వల్లే డ్యూటీ సర్టిఫికెట్ నిబంధన పెట్టామని తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వీఆర్ఏలు విధులు నిర్వర్తించకుండా సొంత పనులు చేసుకుంటున్నారని పలువురు వీఆర్ఓలు తమ దృష్టికి తెచ్చారన్నారు. సక్రమంగా విధులు నిర్వహించే వీఆర్ఏలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పనిచేయకుండా తప్పించుకు తిరిగే వీఆర్ఏలకు డ్యూటీ సర్టిఫికెట్ నిబంధన మింగుడు పడటం లేదని పేర్కొన్నారు. మండలంలో పని చేసే వీఆర్ఏలు ప్రతి నెలా సంబంధిత వీఆర్ఓలతో డ్యూటీ సర్టిఫికెట్ తీసుకొస్తేనే వేతనాల బిల్లులు అప్‌లోడ్ చేస్తామని స్పష్టం చేశారు.

సారా అమ్మితే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

డోన్ రూరల్: నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి బాలరాజు, రంగాపురం గ్రామానికి చెందిన ఉడుగ్గుల రామమద్దయ్యలను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 140 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగా 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేసినా విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ ఎస్.కృష్ణ, ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్, మధుసుదన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, ఉమాకాంతరెడ్డి, జయచంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త

ప్యాపిలి: మామిడి రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి మామిడి దిగుబడి పెంచుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, సీనియర్ శాస్త్రవేత్త కిషోర్ తెలిపారు. మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో మంగళవారం మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సస్యరక్షణ చర్యల్లో భాగంగా ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, సూక్ష్మపోషకాలపై అవగాహన కల్పించారు. సూక్ష్మధాతు లోప నివారణకు జింక్, బోరాన్‌ను ఏడాదిలో కనీసం 3, 4 సార్లు మామిడి చెట్లకు పిచికారీ చేయాలన్నారు. ఒక లీటర్ నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ పూతకు ముందు, పిందెలు గోళీకాయ సైజులో ఉన్నప్పుడు పిచికారీ చేయాలని సూచించారు. కాయ పెరుగుదల దశలో తప్పనిసరిగా డ్రిప్ పద్ధతి ద్వారా చెట్టుకు నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, రైతు సేవా కేంద్ర సిబ్బంది అరుణ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు స్వస్తి పలుకుదాం



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల: పట్టణంలోని కిరణా దుకాణాలు, చికెన్, మటన్ సెంటర్లలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో పట్టణంలోని కిరాణా దుకాణదారులతో పాటు చికెన్, మటన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసుల వాడకం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని జరుగుతుందని తెలిపారు. దీనికి తోడు ప్లాస్టిక్ కవర్లను తినడం వల్ల పశువులు జబ్బుల బారిన పడుతున్నాయని చెప్పారు. మనతో పాటు భవిష్యత్తు తరాల కోసం అందరూ సమష్టిగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు స్వస్తి పలకాలన్నారు. ప్రత్యామ్నాయంగా భూమిలో కరిగి పోయే వాటిని వాడాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. కిరాణ దుకాణ అసోసియేషన్ సభ్యులు గుండా జగన్, మల్లికార్జున, రమేష్, రంజిత్ పాల్గొన్నారు.

శ్రీసుధా విద్యాసంస్థల చైర్మన్ శశికళ మృతి



శశికళ (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీసుధా విద్యా సంస్థల సొసైటీ చైర్మన్ శశికళ (51) మంగళవారం కన్నుమూశారు. కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధ పడుతున్న ఆమె ఇటీవల హైదరాబాద్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నప్పటికీ కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త సాధనగిరి సుదర్శన్ కేవీఎస్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతిపై ఉపాధ్యాయులు, శ్రీసుధా విద్యా సంస్థల డైరెక్టర్లు వేణు, సుధాకర్‌గుప్త, సూర్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యా సంస్థ సమీపంలోని స్వగృహంలో ప్రజల సందర్శనార్థం బుధవారం మధ్యాహ్నం వరకు భౌతికకాయం ఉంచి అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా ఆమె మృతికి సంతాప సూచికగా బుధవారం శ్రీసుధా విద్యా సంస్థలన్నింటికీ సెలవు ప్రకటించినట్లు డైరెక్టర్ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో యూటీఎఫ్ నేత

డోన్ టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లకు ఒకసారి పే రివిజన్ అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.26 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని కోరారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనాయక్, గోపాల్, నాయకులు మనోహర్, శంషాద్‌బేగం, సుమన్, అబ్దుల్ కలాం, సంజీవరాయుడు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–సంజామల ఆర్ అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. సంజామల మండలం ముచ్చలపురికి చెందిన సుబ్బారెడ్డి సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే మండలం గిద్దలూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై కోవెలకుంట్ల వైపు వస్తుండగా మండలంలోని గుంజలపాడు సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన ముగ్గురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 8,900 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి నాగేంద్రప్రసాద్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఇతను ఈనెల 13న కడుపునొప్పి తాళలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మంగళవారం ఉదయం ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి భార్య చాకలి మద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

నేడు గ్రహణ మొర్రి స్క్రీనింగ్ పరీక్షలు

డోన్ టౌన్: పెదవి చీలిక (గ్రహణ మొర్రి), అంగలి చీలిక (గ్రహణశూల) వారికి నంద్యాల శ్రీనివాస సెంటర్ సమీపంలోని మున్సిపల్ హైస్కూల్‌లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రభాకర్, రామనర్సప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ డాక్టర్ ముకుంద రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీడీ ప్రేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి పరీక్షలు జరుగుతాయన్నారు. 6 నెలల నుంచి 50 ఏళ్ల లోపు హాజరుకావచ్చని తెలిపారు. రవాణ ఖర్చులు చెల్లించడంతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి హైదరాబాద్‌లో శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్లకు ఎదురుచూపులు

- భూములు అమ్మకాలు జరిగినా రిజిస్ట్రేన్‌లు జరగని వైనం
- ఆరేడు నెలలుగా నిరీక్షిస్తున్న రైతులు



ఇటిక్యాలలో విక్రయించిన పొలంలో సాగు చేసిన అరటి

కొలిమిగుండ్ల: రీ–సర్వే జరిగిన గ్రామాల్లో భూముల అమ్మకాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు జరగకపోవడంతో ఎప్పుడు జరుగుతాయా అని రైతులు ఎదురుచూస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాల్లో రైతులు పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులకు ఫీజులు, ఇతర అవసరాల కోసం భూములు అమ్మకాలు చేసుకున్నారు. కొనుగోలు సమయంలో కొంత వరకు నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక మిగిలిన మొత్తాన్ని ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. కానీ గతంలో చేసిన రీ–సర్వే గ్రామాల్లోని భూములకు రిజిస్ట్రేషన్‌లు దాదాపు ఆరేడు నెలల నుంచి నిలిచిపోయాయి. దీంతో అమ్మిన, కొనుగోలు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు ఇటిక్యాల సమీపంలో ఓ రైతు అవసరాల నిమిత్తం ఐదు ఎకరాల భూమిని మరో రైతుకు విక్రయించాడు. ముందుగా కొంత సొమ్ము ఇచ్చాడు. మిగిలిన సొమ్ము విషయానికి వచ్చే సరికి రిజిస్ట్రేషన్ అడ్డంకిగా మారుతోంది. ఇలా చాలా పల్లెల్లో ఈ విధమైన సమస్యలు ఏర్పడ్డాయి. మొదటి విడత సర్వే చేసిన వాటిలో జరుగుతున్నాయి. రెండు, మూడు విడతల్లో చేసిన రీ–సర్వేలో ఎక్కువ భాగం రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదని రైతులు వాపోతున్నారు. వీటిలో సైతం కొన్ని గ్రామాలకు సంబంధించి జరుగుతున్నాయి. ఇంకెన్ని రోజులు ఎదురు చూడాల్సి వస్తుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే జాప్యం చోటు చేసుకుంటే రైతుల మధ్య వివాదాలు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని రీ–సర్వే జరిగిన గ్రామాల్లోని భూములకు రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వివేకానంద సూక్తులు అనుసరణీయం





న్యాయమూర్తులకు డైరీలను అందజేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: సమాజానికి, యువతకు స్ఫూర్తినిచ్చే స్వామి వివేకానంద సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతి అన్నారు. తెలుగు తిథి అనుసరించి స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మంగళవారం డోన్ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు రామకృష్ణ మఠం ముద్రించిన నూతన డైరీలను న్యాయవాదులు అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, బార్ కౌన్సిల్ సభ్యులు శేషశయనరావు, రాగుల రాముడు, శ్రీనివాసులు, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

బుక్‌కీపర్ల తొలగింపు దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామైక్య సంఘాల మహిళలు, బుక్‌కీపర్లు

బనగానపల్లె రూరల్: ఎలాంటి కారణం లేకుండా బుక్‌కీపర్లను తొలగించడం దారుణమని గ్రామైక్య సంఘం అధ్యక్షురాళ్లు జుబేదా, మద్దిలేటమ్మ అన్నారు. బనగానపల్లె మండల మహిళా సమైక్య కార్యాలయం వద్ద సభ్యులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకారణంగా సాయికుమార్, మధు అనే బుక్‌కీపర్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. విచారణ చేయకుండానే వారిపై చర్యలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఉన్న ఫలంగా తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. దీనిపై ఏపీఎం శ్రీనివాసులను వివరణ కోరగా తొలగించిన బుక్‌కీపర్ల అవినీతిపై గ్రామైక్య సభ్యుల తీర్మాణం, విచారణ చేశామన్నారు. పొదుపు సభ్యుల నుంచి రూ.500 నుంచి రూ.800 వరకు బలవంతపు వసూళ్లకు పాల్పడినట్లు తెలియడంతో పీడీ ఆదేశాల మేరకు వారిని తొలగించామని తెలిపారు.

గ్రామ దేవతకు పూజలు



బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె మార్గంలోని పుట్ట పెద్దమ్మకు పుష్యమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, నైవేద్యం, మహామంగళహారతి సమర్పించారు. అలాగే అమ్మవారిశాలలోని వాసవీ మాతకు ఆర్య వైశ్యులు, కొలుముల పల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కమ్మేసిన పొగమంచు..!



కోవెలకుంట్ల-సంజామల ఆర్‌అండ్‌బీ రహదారిలో పొగమంచు, పొగమంచు ముందు చిన్నబోయిన సూర్యుడు, లైట్లు వేసుకుని వాహనాల రాకపోకలు

శీతాకాలం కావడంతో రెండు రోజుల నుంచి చలి తీవ్రత మళ్లీ పెరిగింది. చలికి తోడు మంగళవారం తెల్లవారు జాము నుంచి కోవెలకుంట్ల పట్టణాన్ని దట్టమైన పొగమంచు కప్పేసింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు పొగమంచు కురిసింది. ఎదరుగా ఉన్నా మనిషి కనపడనంత దట్టంగా పొగ మంచు ఉండడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. దట్టమైన పొగమంచు ముందు సూర్యుడు చిన్నబోయాడు.

–కోవెలకుంట్ల